శరవేగంగా అండర్ డ్రైనేజీ పనులు

- నుడా నిధులు రూ.27.60 లక్షలతో పనులు
- మంత్రి కాకాణి చొరవతో నిధుల మంజూరు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురంలో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామం చుట్టూ పొలాలు ఉండడం.. ఇళ్లలోని మురుగు బయటకు వెళ్లేందుకు వీల్లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. రైతులకు ఇబ్బంది కలగకుండా పొలాల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కసనాయక్‌కు సూచించారు. ఈ మేరకు ఏఈ ప్రతిపాదనలు పంపగా నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) నుంచి రూ.27.60 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో ఉపసర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి పర్యవేక్షణలో శరవేగంగా పనులు చేపడుతున్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా..

గ్రామం చుట్టూ పొలాలు ఉన్నాయి. గ్రామంలోని మురుగు పొలాల మీదుగా సమీపంలోని నెల్లూరు కాలువలోకి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో రైతులు ఇబ్బందులు పడకుండా అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం రెండు అడుగుల వెడల్పు కలిగిన పైపులతో 336 మీటర్ల పొడవున భూమిలో పైపులైన్ నిర్మిస్తున్నారు. గ్రామంలోని మురుగును ఓ చోటుకు చేర్చి అండర్ డ్రైనేజీ పైపుల ద్వారా నెల్లూరు కాలువలో కలిసేలా పనులు చేపడుతున్నారు.



పైపులైన్ పనులు చేపడుతున్న కూలీలు



అండర్ డ్రైనేజీ కోసం వేస్తున్న పైపులైన్

మంత్రి చొరవతోనే..



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో ఆయన సలహా మేరకు అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నాం. మురుగు రహితంగా గ్రామాన్ని తీర్చిదిద్దేందుకు మంత్రి సహకారం అందిస్తున్నారు. ఇందుకోసం నుడా నుంచి నిధులను మంజూరు చేయించారు.

–కరిపరెడ్డి కష్ణారెడ్డి, ఉపసర్పంచ్, మహ్మదాపురం

తొలిసారిగా అండర్ డ్రైనేజీ పనులు



మండలంలో తొలిసారిగా మహ్మదాపురంలో అండర్ డ్రైనేజీ పనులు చేపడుతున్నాం. రైతుల అనుమతితో వారికి ఇబ్బంది లేకుండా పొలాల్లో పనులు చేపడుతున్నాం. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో పనులను పూర్తి చేస్తాం.

–కే.కసనానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పొదలకూరు.

భక్తిశ్రద్ధలతో భద్రకాళమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెట్టేందుకు ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరులో భద్రకాళమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రకాళమ్మకు తొమ్మిది రోజులు విశేషాలంకరణలు, పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. తొలుత మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టారు. గ్రామాన్ని చల్లగా చూడాలని, కరువు కాటకాలు లేకుండా పంటలు బాగా పండాలని మొక్కుకుని అమ్మవారి నైవేద్యాలు సమర్పించారు.

గంజాయిపై ఉక్కుపాదం

- జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న దాడులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి రవాణా, విక్రయాలపై ఎస్ఈబీ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో దాడులను ముమ్మరం చేసి అక్రమార్కులను కటకటాల వెనక్కి పంపుతున్నారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ హిమవతి పర్యవేక్షణలో ఎస్ఈబీ అధికారులు మూడు రోజులుగా స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. ఎస్ఈబీ నెల్లూరు – 2 ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి గొలగమూడి ఆర్చి సమీపంలో పాడుబడిన భవనంపై ఈ నెల 28న దాడులు చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి నగరానికి చెందిన రవితేజ, ఓబులాదర్‌కు తమిళనాడు రాష్ట్రానికి చెందిన భరత్ షణ్ముగవేల్, చిన్నసామి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వీరి నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరో 30 కిలోలపైగా గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. గంజాయి రవాణా, విక్రయాలపై డయల్ 100, 14500కు సమాచారం అందించాలని ఎస్ఈబీ అధికారులు కోరారు.



పట్టుబడిన గంజాయితో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు

క్లుప్తంగా

నేడు గుండాలమ్మపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొడవలూరు: మండలంలోని గుండాలమ్మపాళెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిబిరాన్ని గుండాలమ్మపాళెం సచివాలయ పరిధిలోని ఆరోగ్య సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిందితులపై కఠిన చర్యలకు వినతి

నెల్లూరు(పొగతోట): కావలిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లంపాటి పెంచలరెడ్డి, ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించనున్నామని చెప్పారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని భారత రక్షణ శాఖ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఆయన్ను ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ ఆహ్వానించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. దేవాదయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్‌కు సత్కారం



నెల్లూరు రూరల్: జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం సత్కరించారు. నిండు నూరేళ్ల కార్యక్రమంలో భాగంగా చెంచయ్య, అంకయ్య దంపతులను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, కృష్ణయ్య, రమణమూర్తి, రాజగోపాల్, ప్రసాద్, హరిసుధ, హర్షవర్ధిని, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌జాన్‌కు ఆర్ట్ గెలాక్సీ అవార్డు



నెల్లూరు(బృందావనం): అమీర్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు, నగరానికి చెందిన చిత్రకారుడు అమీర్‌జాన్ ఆర్ట్ గెలాక్సీ అవార్డును అందుకున్నారు. ఒంగోలులో సృష్టి అర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్లో అవార్డును తనకు అందజేశారని ఆయన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెల్ఫ్ పోర్ట్‌రైట్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో తనతో పాటు నెల్లూరు చిత్రకారులు అన్నపూర్ణ, సుందరబాబు, సునీతారవి, రమణ, శేషయ్య, బాబూరావు తమ చిత్రాలను కాన్వాస్‌పై మూడు గంటల్లో చిత్రీకరించారని తెలిపారు.

జనహిత వాత్సల్యలో అన్నదానం



నెల్లూరు(బృందావనం):కొండాయపాళెం రోడ్డులోని జనహిత వాత్సల్య చిన్నారుల, వృద్ధుల ఆశ్రమంలో అన్నదానంతో పాటు నోట్ పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. మానవసేవే మాధవసేవ టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడారు. దేవిశెట్టి రామలింగయ్యనాయుడు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు ప్రతాప్ కుమార్, కుమార్తె నళిని, మానవసేవే మాధవ సేవ బృంద సభ్యురాలు గాదిరెడ్డి లక్ష్మీదేవి సౌజన్యంతో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. విశ్రాంత ఎస్సై పుల్లారెడ్డి తన తండ్రి కోటారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని అన్నదానం చేశారన్నారు. పరిమళ, రాఘవ, విశ్వనాథం, ఇందిర, కోలా రవి, సుప్రియ, ముత్యాల శ్రీనివాసులు, విజయమ్మ, కల్పం శ్రీనివాసులు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిదేవిగా రాజరాజేశ్వరి



మనుబోలు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మనుబోలులోని కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం వద్ద ఆదివారం కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు అమ్మవారిని కామక్షిదేవిగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా పముజుల పరంధామయ్య, శివానందమ్మ, కయ్యూరు సుధాకర్‌రెడ్డి, సుమతి దంపతులు వ్యవహరించారు.

రీ సర్వేను పరిశీలించిన తమిళనాడు బృందం



రీ సర్వే వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న తమిళనాడు బృందం

ఇందుకూరుపేట: మండలంలోని పున్నూరులో జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమం కింద చేపడుతున్న భూ సర్వేను తమిళనాడు అధికారుల బృందం ఆదివారం పరిశీలించింది. రాష్ట్ర ప్రభుత్వం అధునాతన టెక్నాలజీతో చేపడుతున్న భూసర్వే తీరుతెన్నులను తెలుసుకునేందుకు తమిళనాడు అధికారుల బృందం సభ్యులు పున్నూరుకు వచ్చారు. రికార్డులను పరిశీలించడంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చేపడతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వే, రెవెన్యూ అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, డీఎస్ఎల్ఓ హనుమాన్‌ప్రసాద్, సర్వే డీటీ రవికుమార్, మండల సర్వే అధికారి హరనాథ్, విలేజ్ సర్వేయర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రైల్లోంచి జారిపడి యువకుడికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జార్ఖండ్ యువకుడు

కొడవలూరు: రైల్లోంచి జారిపడి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కొడవలూరు రైల్వేగేటు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అస్తలాల్ మహతో(26) అనే యువకుడు ఉపాధి నిమిత్తం రైలులో కేరళ రాష్ట్రానికి వెళుతున్నాడు. రైలులో ఫుట్‌బోర్డుపై కూర్చుని ప్రయాణిస్తూ నిద్రలోకి జారుకున్నాడు. ఈ క్రమంలో కొడవలూరు రైల్వే గేట్ వద్ద రైలు నుంచి జారి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎడమ కాలు కింది భాగం బాగా నుజ్జునుజ్జు కావడంతో వైద్యులు కొంత భాగం తొలగించినట్లు రైల్వే ఎస్సై అరుణకుమారి చెప్పారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

పవిత్ర పెన్నమ్మ ఒడిలో చెత్త డంపింగ్



కామాక్షితాయి ఆలయం వద్ద పెన్నా నదిలో చెత్త పోస్తున్న దృశ్యం



చెత్త పోసిన ప్రాంతంలో స్నానాలు చేస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయానికి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. ఆలయానికి వచ్చిన భక్తులు పక్కనే ఉన్న పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. పుణ్యస్నానాలు చేసే ప్రదేశం వద్దే కొందరు చెత్తను డంప్ చేస్తుండడం చూసి భక్తులు అసహనానికి గురవుతున్నారు. పవిత్ర పెన్నా నది కలుషితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను నదిలో పోయకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అలరించిన పాటలు, నృత్య పోటీలు



నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో అరిగెపూడి విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పాటలు, నృత్య పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. పేద కళాకారులకు ఆర్థిక సాయం చేశారు. మిమిక్రీ కళాకారుడు అమానుల్లాఖాన్, కోలాట గురువు వంశీకృష్ణారెడ్డి, తదితరులను సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన, సంగీత విభావరి అలరించాయి. చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ నిర్వాహకుడు రమేష్‌బాబు, పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై తనయుడి దాడి

పొదలకూరు : తల్లిదండ్రులపై తనయుడు దాడికి పాల్పడిన ఘటన పట్టణంలోని శివాలయం వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శివాలయం వీధిలో తిరుపాల్, లక్ష్మమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వారిపై కుమారుడు చిన్నా మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో లక్ష్మమ్మ తలకు గాయమైంది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు లక్ష్మమ్మను నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదును సరిచూసుకోండి

వెంకటాచలం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ సాగుకు సంబంధించిన ఈ–క్రాప్ నమోదు ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించామని ఏఓ డీ హరికరుణాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులందరూ సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి పంట వివరాలను సరిచూసుకోవాలని, తప్పులు ఉంటే వీఏఏలను సంప్రదించి సరిచేయించుకోవాలని కోరారు.

సన్మానం



కోవూరు: స్థానిక గాంధీపార్కు సెంటర్‌లోని కోదండరామస్వామి ఆలయంలో విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తున్న 40 మంది భక్తులకు ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మించి ప్రారంభించినప్పటి నుంచి విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

కొడవలూరు: గడ్డివామి దగ్ధమైన ఘటన మండలంలోని చంద్రశేఖరపురంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అన్నపూర్ణమ్మ గేదెల మేత కోసం 8 ఎకరాల్లోని గడ్డిని కొనుగోలు చేసి ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో వేసుకున్నారు. ఆదివారం ఏం జరిగిందో ఏమో గడ్డివామి తగలబడిపోతుండడం చూసి బాధితులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసినప్పటికి గడ్డివామి పూర్తిగా కాలిపోయింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు..నెల్లూరు నగరానికి చెందిన మురళీకృష్ణ నిడిగుంటపాళేనికి పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై బయలుదేరాడు. సర్వేపల్లి సమీపంలో అడ్డు వచ్చిన గేదెలను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ గాయపడగా చికిత్స నిమిత్తం నెల్లూరు తరలించారు.

ముత్తుకూరు డీటీగా భాగ్యలక్ష్మి

నెల్లూరు(దర్గామిట్ట): ముత్తుకూరు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా భాగ్యలక్ష్మి నియమితులయ్యారు. అదే మండలంలో రీ సర్వే డీటీగా పనిచేస్తున్న ఆమెను రెగ్యులర్ డీటీగా నియమిస్తూ కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అక్కడి డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులును రీ సర్వే డీటీగా బదిలీ చేశారు.

వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజ హాల్లో వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని ఆదివారం నిర్వహించారు. నెల్లూరు సిటీ అధ్యక్షుడిగా చలువాది నాగేశ్వరరావు, కార్యదర్శిగా పాదర్తి బాలాజీ, కోశాధికారిగా పబ్బిశెట్టి నందకిషోర్, ప్రోగ్రామ్ చైర్మన్‌గా చలువాది వెంకటేశ్వర్లు, మరో 18 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. సేవకు ప్రతి రూపం వాసవీ క్లబ్ అని కొనియాడారు. క్లబ్‌లో సభ్యులుగా 108 మంది దంపతులు తొలి విడతగా సభ్యత్వాన్ని స్వీకరించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధికారి సిద్దా సూర్యప్రకాష్‌రావు, ఊటుకూరు అన్నపూర్ణ, కొణిజేటి వెంకటసురేష్, బాబు, పేర్ల సత్యనారాయణ, చేబ్రోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలి



క్రీడాకారులతో ఆనం అరుణమ్మ

నెల్లూరు(స్టౌన్‌హౌస్‌పేట): జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలను సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కాంక్షించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న స్క్వే మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. గోవాలో జరుగుతున్న జాతీయ పోటీల్లో మొదటిసారి స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహిస్తుండటం, ఇందులో రాష్ట్ర జట్టు పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. స్క్వే అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, కోచ్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న శ్యామ్‌ధన్

నెల్లూరు రూరల్: పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయుర్వేద వైద్యుడు కూరపాటి శ్యామ్‌ధన్ పేర్కొన్నారు. కొత్తూరు పరిధిలోని గ్రామికనగర్‌లో గల ఎస్వీఎస్ స్కూల్లో తల్లిదండ్రులతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందని చెప్పారు. కరస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జి సెల్వి, ఇన్‌చార్జి గౌరి తదితరులు పాల్గొన్నారు.

వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నెల్లూరు(మినీబైపాస్): ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీని నగరంలోని చేనేత కార్మిక సంఘ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా భవనగిరి మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా నందం శ్రీనివాసులు, కోశాధికారిగా తిరుపతి పద్మనాభం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ కోశాధికారి కుమారస్వామి, సెక్రటరీ లక్ష్మీనారాయణ, జాతీయ మీడియా సలహాదారు త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.